స్థలం సరే.. నిధులేవి?

సర్కారు ఖజానాకు అత్యధిక వనరులు సమకూర్చే ఆ శాఖ కార్యాలయానికి సొంత భవనం లేదు. ఉన్నదాంట్లో సౌకర్యాలు కరువు. వెరసి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రతిపాదనలు ఉన్నప్పటికీ.. అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.

రేకుల షెడ్డులో ఎక్సైజ్ కార్యాలయం

- సొంత భవనం లేదు.. ఉన్నదాంట్లో సౌకర్యాలు కరువు
- వసతుల లేమితో ఇబ్బంది పడుతున్న సిబ్బంది
- ప్రతిపాదనలకే పరిమితమైన నూతన భవనం



పాత అతిథిగృహంలో కొనసాగుతున్న ఎక్సైజ్ కార్యాలయం

ఆమనగల్లు: అసౌకర్యాల నడుమ ఎక్సైజ్ కార్యాలయం కొనసాగుతోంది. ప్రస్తుతం ఆ కార్యాలయ కార్యకలాపాలు ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలోని పాత అతిథి గృహం రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. వసతుల లేమితో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అయినా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు ఆ కార్యాలయం గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా.. అవి కాగితాలకే పరిమితమయ్యాయి. స్థలం కేటాయించినప్పటికీ.. నిధులు మంజూరు సమకూర్చకపోవడంతో భవనం నిర్మాణానికి నోచుకోలేదు.

నాలుగు మండలాలకు..

ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు కలిపి 2002లో ఎక్సైజ్ సీఐ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పట్లో ఆ శాఖ సీఐ కార్యాలయాన్ని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. సుమారు 15 ఏళ్ల పాటు అక్కడే కొనసాగింది. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని పాత ఎంపీడీఓ భవనంలోకి మార్చారు. రెండేళ్ల క్రితం పట్టణానికి కోర్టు మంజూరు అయింది. దీంతో ఎక్సైజ్ కార్యాలయం నిర్వహిస్తున్న భవనాన్ని కోర్టుకు కేటాయించారు.

పాత అతిథిగృహంలో..

ఉన్న భవనాన్ని కోర్టుకు కేటాయించడంతో.. ఎక్సైజ్ కార్యాలయాన్ని అదే ఆవరణలోని పాత అతిథిగృహం (సగం రేకులతో ఉన్న షెడ్డు)లోకి మార్చారు. ప్రస్తుతం అక్కడే కొనసాగుతున్నప్పటికీ.. తగిన సౌకర్యాలు లేవు. రేకుల షెడ్డులో కార్యకలాపాల నిర్వహణ కష్టంగా మారింది. ప్రస్తుతం ఆ కార్యాలయంలో సీఐ, ముగ్గురు ఎస్ఐలు, 12 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

స్థలం కేటాయింపు

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం, దశాబ్దం క్రితం.. ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ భూమిలో 11 గుంటలు కేటాయించింది. కానీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించలేదు.

నివేదించాం



ఎక్సైజ్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం స్థలం కేటాయించింది. భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరాము. ప్రస్తుత కార్యాలయం కార్యకలాపాలకు అనువుగా లేదు. సౌకర్యాలు కరవు. నూతన భవనంతో సమస్యలు తీరుతాయి.

– బద్యానాథ్‌చౌహాన్, ఎక్సైజ్ సీఐ, ఆమనగల్లు

క్లుప్తంగా

నేడు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం కడ్తాల్ మండలం మైసిగండి ఎంఆర్‌జీ ఫంక్షన్ హాలులో జరగనుందని క్లబ్ పీఆర్ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.కోటేశ్వర్‌రావ్, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ శ్యాంకుమార్, మల్టీపుల్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎలక్ట్ గవర్నర్ మహేందర్‌కుమార్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, సురేశ్ జగ్గాని, రమేశ్‌బాబు, జనార్దన్‌రెడ్డి, జోన్ చైర్మన్ లింగయ్య హాజరవుతారన్నారు. నూతన అధ్యక్షుడిగా గోవర్దన్‌రెడ్డి ఇతర సభ్యులు ప్రమాణం చేయనున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

కడ్తాల్: విశ్రాంత ఉద్యోగి కదారి శివరాజ, నార్లకంటి మల్లేశ్‌లు ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబాలను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్ తదితరులు పరామర్శించారు. ఇందులో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్



అఖిల్, ఆయన తల్లిదండ్రులను సన్మానించిన పాఠశాల యాజమాన్యం

కడ్తాల్: దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిల్లోనే ఉందని, క్రమశిక్షణతో చదివి జీవిత లక్ష్యాలను చేరుకోవాలని ఫార్చున్ బటర్‌ఫ్లై పాఠశాల వ్యవస్థాపకుడు శేషగిరిరావు అన్నారు. మండల పరిధి గడ్డమీదితండా సభవట్ అఖిల్ నీట్‌లో 5833 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థితో పాటు ఆయన తల్లితండ్రులు బుజ్జి, బస్సీలాల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సహ వ్యవస్థాపకుడు రమేశ్, ప్రిన్సిపాల్ సంజీవ్‌నాంపల్లి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేదింటి బిడ్డ చదువుకు 'ఉప్పల' సహకారం



చిట్టికి సహాయం అందజేస్తున్న వెంకటేశ్

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం తాళ్లగుట్టతండా నిరుపేద బాలిక చిట్టి చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అండగా నిలిచారు. గతేడాది 6, ప్రస్తుతం 7వ తరగతికి చేయూతనందించారు. ఈ ఏడాదికి అవసరమైన ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మాడ్గుల: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తుందని యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు దళపతి గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధి దిల్వార్‌ఖాన్ పల్లి గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియని, దశలవారీగా అర్హులందరూ లబ్ధిపొందుతారని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన పార్టీ శ్రేణుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ గౌడ్, శివ, శంకర్, యాదయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు నేతల శుభాకాంక్షలు



భట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న రమేశ్‌గౌడ్

ఆమనగల్లు: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ మాడ్గుల మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ప్రజాభవన్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రమేశ్‌గౌడ్, నాయకులు గిరి తదితరులు భట్టిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజీవ్‌కూడలిలో..

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారి రాజీవ్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేశారు. కేకు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, నాయకులు అబ్దుల్‌ఖాదర్, మల్లయ్య, కరీం, బాబా, అలీం, సురేశ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాటగీత పార్టీ శ్రేణులతో కలిసి కేక్‌కట్ చేశారు. నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు రాంచందర్, జహంగీర్‌అలీ, మల్లేశ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, హీరాసింగ్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్: ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకులు ఆదివారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకుడు దోమలపల్లి దర్శన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.



కడ్తాల్: కేక్ కట్ చేస్తున్న చైర్ పర్సన్ గీత, నాయకులు



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

తుర్కయంజాల్: అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధి 74 మందికి రూ.32 లక్షల 16వేల 500ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు ఆపత్కాలంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద మండల పరిధి బాటసింగారం గ్రామానికి చెందిన పిట్టల సహదేవకు రూ.60 వేలు, ఎండీ గాలీబ్‌కు రూ.39, వేలు రామసామి సుశీల రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం బాధితులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పాలకులు లేక.. పరిష్కారం కాక

- గ్రామాల్లో తిష్టవేసిన సమస్యలు
- ఇబ్బంది పడుతున్న పల్లె ప్రజలు
- స్థానిక ఎన్నికలు నిర్వహించలేని స్థితిలో ప్రభుత్వం
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీరామ్‌నాయక్



సదస్సులో మాట్లాడుతున్న శ్రీరామ్‌నాయక్

యాచారం: స్థానిక పాలకులు లేక గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయని, తద్వారా ప్రజలు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీరామ్‌నాయక్ అన్నారు. ప్రజా సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించలేని స్థితిలో కాంగ్రెస్ ఉందని విమర్శించారు. తమ్మలోనిగూడ గేట్‌లో జరుగుతున్న పార్టీ మండల స్థాయి శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం ముగిసి రెండేళ్లు కావస్తున్నా.. నేటికీ ఎన్నికలు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ మాదిరిగానే, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలపై రాజీలేని పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో సీపీఎం పార్టీ ప్రతినిధులు అత్యధిక గ్రామాల్లో గెలిచే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు పి.అంజయ్య, బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు చేయూత



సామగ్రి అందజేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం, కొత్తగూడెం మహిళా సమాఖ్య సంఘాలకు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్ సొంత నిధులు వెచ్చించి సామగ్రి వితరణ చేశారు. రూ.75 వేలతో 40 కుర్చీలు, 4 కార్పెట్లు, అల్మారి, టేబుల్, కొత్తగూడెంలో 30 కుర్చీలు, టేబుల్ ఆదివారం అందజేశారు.

అపరిశుభ్రం.. ప్రజా మూత్రశాల

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ప్రజా మూత్రశాల

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని కొత్తపేట గ్రామంలో నిర్మించిన ప్రజా మూత్రశాల నిర్వహణ లోపంతో దుర్గంధ భరితంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోని బస్తీ దవాఖానా పక్కనే ఈ టాయిలెట్ ఉంది. అక్కడి నుంచి వస్తున్న దుర్వాసనతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ నెల పింఛన్ తీసుకునేందుకు వచ్చే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఈ మూత్రశాలకు వెళ్లి ఇబ్బందులకు గురవుతున్నామని వారు చెబుతున్నారు. దీని గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి టాయిలెట్లను శుభ్రంచేయించాలని కోరుతున్నారు.

నేడు రైతు నేస్తం

వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

- మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత

కడ్తాల్: రైతు నేస్తం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికతో పాటు రావిచేడ్, ముద్వీన్ రైతు వేదికల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రైతు నేస్తం ప్రారంభం కానుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 1,031 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. రైతు నేస్తంలో ఆయా ప్రాంతాల రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, వానాకాలం సాగుపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కొత్తగా పట్టదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు, రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత తెలిపారు. పట్టదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలతో గ్రామాల్లోని రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ నెల 18 లోగా అందజేయాలని సూచించారు.

మోడల్ హౌస్‌కు ప్లాస్టరింగ్

స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కడ్తాల్: ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని 'మో'డల్'శీర్షికన ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆలస్యమైనా అధికారులు స్పందించారు. రెండు రోజులుగా భవన నిర్మాణానికి ప్లాస్టరింగ్ పనులు చేయిస్తున్నారు. మరో పది రోజుల్లో మిగతా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. భవన నిర్మాణంలో కదలిక వచ్చేలా 'సాక్షి' చేసిన కృషికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



ప్లాస్టరింగ్ పనులు చేస్తున్న కార్మికులు

పేదల సంక్షేమమే ప్రధాని లక్ష్యం

బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్



మాజీ కార్పొరేషన్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న అందెల, మాజీ కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ పాలన సాగుతుందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాదర్‌గుల్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో వికసిత భారత్ సంకల్ప సభను పార్టీ కార్పొరేషన్-2 అధ్యక్షుడు వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అందెల శ్రీరాములు హాజరై ప్రసంగించారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల ప్రయాణం విజయవంతంగా కొనసాగుతుందని కొనియాడారు. నమ్మకం, ఆశీర్వాదం, విశ్వాసంతోనే మోడీ వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చారని కొనియాడారు. భారతదేశాన్ని తిరుగులేని శక్తిగా ప్రపంచ పటంలో నిలపారన్నారు. అనంతరం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న 10 మంది మాజీ కార్పొరేటర్లను సన్మానించారు.

అతివేగం ప్రమాదకరం

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు



కుర్మిద్దలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, సిబ్బంది

యాచారం: అతివేగం ప్రమాదకరమని, రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు హెచ్చరించారు. పీఎస్ పరిధి కుర్మిద్ద గ్రామం, తాడిపర్తి– మీర్‌ఖాన్‌పేట గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విజ్ఞానపురి కాలనీ అధ్యక్షుడు కృష్ణ

మీర్‌పేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని మీర్‌పేట కార్పొరేషన్ విజ్ఞానపురి కాలనీ అధ్యక్షుడు ఆర్ కృష్ణ పేర్కొన్నారు. బృంగి హాస్పిటల్ సహకారంతో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ సెంటర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఉచిత న్యూరో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత ఆహారపు అలవాట్లు, ఉరుకులు పరుగుల జీవితంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదన్నారు. కాలనీవాసుల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేకంగా ప్రతీ ఆదివారం వైద్య శిబిరాన్ని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అడ్మిషన్ల భర్తీకి శ్రీకారం

- బీసీ సంక్షేమ బాలుర గృహంలో 100 సీట్లు
- నాణ్యమైన భోజనంతో పాటు వసతి
- తుక్కుగూడలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం



తుక్కుగూడలోని బాలుర వసతిగృహం

తుక్కుగూడ: బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. వీటిలో భాగంగా తుక్కుగూడ పురపాలిక కేంద్రంలో బాలుర గృహం కలదు. ఇందులో విద్యార్థుల సంఖ్య పూర్తి స్థాయిలో భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనికోసం కొత్తగా చేరబోయే వారికి పలు రకాల వసతులను కలిపించనున్నారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏటా తగ్గుతూ వస్తోంది. దీంతో ఈ గృహంలో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రవేశాల కోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు.

మూడో తరగతి నుంచి..

బాలుర వసతి గృహంలో మూడోతరగతి నుంచి పదోతరగతి వరకు 100 మందికి ప్రవేశం కల్పించే అవకాశం ఉంది. రెండు, మూడేళ్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యార్థులు చేరకపోవడంతో కొన్ని సీట్లు మిగిలిపోయేవి. తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ప్రస్తుతం 50శాతం పైగా విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో ప్రవేశాలే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇక్కడ ఇతర మండలాలకు చెందిన వారికి సైతం ప్రవేశం కల్పించనున్నారు. స్థానికంగా ఉండే పాఠశాలలకు, తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. వసతిగృహంలో చేరేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇక్కడ వసతి గృహంలో 100 మంది విద్యార్థుల్లో బీసీలకు 75 సీట్లు, ఎస్సీలకు 15సీట్లు, ఎస్టీలకు 5 సీట్లను కేటాయించారు.

పౌష్టికాహారం అందజేత..

విద్యార్థులకు వసతితో పాటు, నాణ్యమైన భోజనాన్ని నిత్యం అందించనున్నారు. గతంలో విద్యార్థులకు మెస్ చార్జీల రూపేణ ఒక్కరిపై రూ.1,100లు ఖర్చు చేస్తుండేది. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా రూ.2,150 వెచ్చించనుంది. దీంతో విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం వడ్డించనున్నారు.

ప్రతీరోజు..

ఉదయం 7గంటలకు రాగిజావ, పాలు. అనంతరం గంట తరువాత బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ఉప్మా, పులిహోర, కిచిడి రసం, చపాతి, పూరీ, ఇడ్లీ, జీర రైస్, టమాట అన్నం ఇలా రోజుకోరకంగా అందజేయనున్నారు. మధ్యాహ్నం పాఠశాలలో భోజనం ఉంటుంది. సాయత్రం ఐదు గంటలకు స్నాక్స్ పల్లిపట్టి, అటుకులు, బిస్కెట్స్, శనగలు, బొబ్బర్లు తదితర పదార్థాలు అందించనున్నారు. గతంలో వారానికి రెండు గుడ్లు, అరటిపండ్లు ఇచ్చేవారు. ఇప్పుడు వారంలో ఐదు రోజుల పాటు ఇవ్వనున్నారు. వారంలో ఆదివారం చికెన్ ఉంటుందని అధికారులు తెలిపారు. దీనికి తోడు విద్యార్థులకు మూడోతరగతి నుంచి ఏడో తరగతి వరకు రూ.150, 8నుంచి 10వ తరగతి వరకు రూ.200 కాస్మోటిక్ ఛార్జీలను ప్రభుత్వం చెల్లించనుంది.